
ప్రజాశక్తి
శనివారం 31 ఆగస్టు 2024
5
పార్వతీపురం మన్యం



జిల్లా ప్రత్యేక అధికారిగా కోన శశిధర్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాకు ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను నియమించింది. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం చేసి ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యం నెరవేరే విధంగా అమలు చేయడంలో ప్రత్యేక అధికారులు తోడ్పడతారని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మంచం పట్టిన మన్యం



జిల్లా ఆస్పత్రిలో ఒకే మంచంపై చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మన్యం జిల్లాను సీజనల్ వ్యాధులు వణికిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఏ ఇంట్లో చూసినా ఇద్దరు, ముగ్గురు జ్వరంతో బాధపడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గత నెల రోజుల క్రితం కురిసిన వర్షాలు తర్వాత జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోయింది. దీంతో జిల్లాలో గల 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగుల అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంతో పాటు పాలకొండ, సీతంపేట, సాలూరు ఏరియా ఆసుపత్రుల్లోనూ అధిక సంఖ్యలో ఇన్ పేషెంట్లు చేరడంతో ఆరోగ్యశాలలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, జలుబు లక్షణాలతో పాటు డెంగీ, మలేరియా కేసులు కూడా బయట పడుతున్నాయి. పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి 150 పడకలు పరిమితి అయినప్పటికీ రోజుకు 250 నుండి 300 వరకు రోగులను జాయిన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగుల సంఖ్య అధికంగా ఉండడంతో ఆసుపత్రి వర్గాలు 50 మంచాలు అదనంగా వేసినప్పటికీ ఒక్కో మంచానికి ఇద్దరేసి రోగులను వేసి చికిత్స అందించాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపిల్లల వార్డుల్లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో రోగులతో పాటు వారితో సహాయకులుగా వచ్చిన వారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. జిల్లా ఆసుపత్రిలో ఓపి ప్రతిరోజు 500 దాటి 600 వరకు నమోదు చూస్తుంటే జిల్లాలో జ్వరాల ఉధృతి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. గత ఏడాది మలేరియా కేసులు 482 నమోదు కాగా, ఈ ఏడాది జూలైలోనే 1249 మందికి సోకినట్లు రక్త పరీక్షల్లో తేలింది. అలాగే డెంగీ కేసులు కూడా గత ఏడాది 232 నమోదు కాగా, ఈ ఏడాది జూలై నాటికి 59 మందికి ఉన్నట్టుగా రక్త పరీక్షలు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

రోగులతో కిటకిటలాడుతున్న జిల్లా ఆస్పత్రి

జిల్లావ్యాప్తంగా 37 పీహెచ్సీలు, ఐదు అర్బన్ పిహెచ్‌సిలు ఉన్నప్పటికీ రోగులు ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్ర ఆసుపత్రానికి తరలి రావడానికి ఇష్టం చూపించడంతో రోగుల అవసరాల మేరకు వైద్యులు చికిత్సను అందించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు సెలైన్ ఎక్కించేందుకు ఐవీ సెట్లు, మందులు, మాత్రలతో పాటు గ్లౌజ్‌ల కొరత ఆసుపత్రుల్లో నెలకొంది. ఈ పరిస్థితిపై జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవితో పాటు రీజనల్ మెడికల్ అధికారి శ్యామలాదేవి స్పందిస్తూ, సాధారణంగా ప్రతి ఏటా ఈ సీజన్‌లో రోగులు అధిక సంఖ్యలో రావడం పరిపాటేనని, కాకపోతే ఈ ఏడాది రోగుల హాజరు శాతం పెరిగిందని అన్నారు. అయినప్పటికీ రోగులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో మందులు సమకూర్చుకొని అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఆసుపత్రి విస్తరణ కార్యక్రమం జరుగుతున్నందున రోగులను పడక మంచాల్లో సర్దుబాటు చేయాల్సి వస్తుందని, మరొక 15 రోజుల్లో పరిస్థితులు అనుకూలిస్తాయని, వైద్యం అందించడంలో వైద్య సిబ్బంది, వైద్యులు పూర్తిస్థాయిలో అంకితభావంతో పనిచేసి సేవలు అందిస్తున్నారని అన్నారు. అలాగే ప్రజలు సాధారణ జ్వరాలకు కూడా తమ గ్రామాల్లో ఉన్న సబ్‌సెంటర్లలో, పిహెచ్‌సిల్లో సంప్రదించకుండా నేరుగా ప్రధాన ఆసుపత్రులకు తరలి రావడంతో రద్దీ ఏర్పడిందని, వీటిపై అవగాహన పెంచుకుని రోగులు జ్వర లక్షణాలు కనబడిన వెంటనే స్థానిక ఎఎన్ఎంలను సంప్రదించి సబ్ సెంటర్లకు, పిహెచ్‌సిలకు వెళ్లి వైద్య సేవలు పొందాలని వారు కోరారు.



ఒపి కోసం క్యూ కట్టిన రోగులు

అందరి నోట బదిలీల మాట

- సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- 15 వరకు గడువు పొడిగింపుతో ఊరట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ పార్వతీపురం

ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల నోట బదిలీల మాటే వినిపిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సివిల్ సప్లయి, గనుల శాఖ, అన్ని ఇంజినీరింగ్ విభాగాలు, దేవాదాయ శాఖ ట్రాన్స్‌పోర్టు, కమర్షియల్ అండ్ ఎక్సైజ్ సహా మొత్తం 15 శాఖల అధికారులు, ఉద్యోగుల బదిలీలకు ఈనెల 17న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. నాటి నుంచి ఉన్న చోట కొనసాగేందుకు కొందరు, ఇతర స్థానాలకు వెళ్లేందుకు మరికొందరు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యేల సిఫార్సుల లేఖల కోసం తిరుగుతున్నారు. దాదాపు అందరు ఎమ్మెల్యేలు లేఖలు ఇస్తున్నట్టుగా చర్చనడుస్తోంది. అయితే, ఇప్పటి వరకు జిల్లాలో బదిలీల ప్రక్రియ చాపకింద నీరులా సాగడమే తప్ప, ఊపందుకోలేదు. రెండు రోజుల క్రితమే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నల్లనయ్య బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ, గ్రామ సచివాలయాలు, మెప్మా విభాగాల్లో కసరత్తు ప్రారంభమైంది. మిగిలిన శాఖల్లో పెద్దగా మార్పులు కనిపించలేదు. వాస్తవానికి నేటి (ఈనెల 31)తో బదిలీల ప్రక్రియ పూర్తిచేయాల్సివుంది. కానీ, బదిలీల ప్రక్రియకు సమయాన్ని సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో కొందరికి ఊరట, మరికొందరికి ఉత్కంఠగా మారింది. ఇప్పటి వరకు కలెక్టర్ అంబేద్కర్, అటు మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బదిలీల విషయంలో పెద్దగా జోక్యం చేసుకోలేదని సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బదిలీలు జరుగుతాయంటూ సిఫార్సుల లేఖలను సున్నితంగా తిరస్కరిస్తున్నారు. అయితే, ఆ లేఖలు ఇచ్చిన ఎమ్మెల్యేల నుంచి ఒత్తిడి వచ్చే అవకాశం లేకపోలేదు. ఆ పరిస్థితి ఏర్పడితే కలెక్టర్లు ఇద్దరూ ఎలా స్పందిస్తారో అన్నదానిపై సర్వత్ర చర్చనడుస్తోంది. వీలైనంత వరకు అధికారులు, ఇతర ఉద్యోగులను మాతృశాఖలు, సంస్థలకే పంపాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టుగా బోగట్టా. ఈనేపథ్యంలో ప్రస్తుతం డిప్యుటేషన్లపై పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంటోంది.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్‌సిఎం సెయింట్ పీటర్స్ స్కూల్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకూ సాగిన ఎయిడ్స్, హెచ్ఐవిపై అవగాహనా చైతన్య ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి అనేది లైంగిక కార్యకలాపాలు ద్వారా మాత్రమే ఇతరులకు సంక్రమిస్తుందని తెలిపారు. హెచ్ఐవి వైరస్ సోకడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి బలహీనమవుతుందన్నారు. ఈ వైరస్ సోకిన తర్వాత ఎలాంటి లక్షణాలు కనపడతాయి, వ్యాధి ఎలా వ్యాపి చెందుతుంది, రాకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహనా కల్పించడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ 5కె రెడ్ రన్ మారథాన్‌లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని కలెక్టర్ అన్నారు. అలాగే సెప్టెంబర్ 3న జరగబోయే రాష్ట్ర స్థాయి మారథాన్ పోటీలకు పంపనున్నట్టు తెలిపారు.

ఎయిడ్స్ పై అవగాహనా అవసరం : రెండవ అదనపు జిల్లా జడ్జి

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహనా కలిగి ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. శుక్రవారం 5కె రెడ్ రన్ మారథాన్ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాట్లు చేసిన ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ కు చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. మందులు వాడుతూ బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల వైరస్‌ను అదుపుచేస్తూ, దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించేందుకు మార్గాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపడం నేరమని, వారు కూడా మనలాంటి వారేనని, ప్రేమగా మసలుకోవాలని సూచించారు. హెచ్ఐవీని ఎంత తొందరగా గుర్తిస్తే అంత తొందరగా వైరస్ లక్షణాలను తగ్గించే చికిత్స ప్రారంభించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎం.వినోద్ కుమార్, ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయాధికారి డాక్టర్ పిఎల్ రఘు కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంచాలి : డిఐజి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి గోపీనాథ్ జెట్టీ, ఎస్‌పి, ఎఎస్‌పిలు

ప్రజలో పోలీసుశాఖ మీద నమ్మకాన్ని, ప్రతిష్టను పెంచే విధంగా బేసిక్ పోలీసింగ్ విధానాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది అమలు పరచాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టీ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లాలో పర్యటించారు. ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి, అదనపు ఎస్‌పి దిలీప్‌కిరణ్, ఎఎస్‌పి అంకిత మహవీర్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పోలీసు అధికారులతో మాసాంతపు నేర సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ హోంగార్డు నుండి ఐపిఎస్ అధికారుల వరకు ఎంతో శ్రమించి, పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమటింపజేసారని, ఆ ప్రతిష్టను మరింతగా పెంచేందుకు సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. పోలీసు స్టేషనుకు న్యాయం కోసం వచ్చే వారి పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారికి అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను శ్రద్ధతో విని, న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు వ్యవస్థలో మార్పులు వచ్చినప్పటికీ నేరాల నియంత్రణలో గతంలో అవలంభించిన బేసిక్ పోలీసింగును మరిచిపోవద్దని, గ్రామ సందర్శనలు, పెట్రోలింగు, రాత్రిబీట్లు, పగలు బీట్లు చేయాలని సూచించారు. గతంలో నమోదైన నేరాల కంటే ప్రస్తుతం కొత్త తరహాలో నేరాలు నమోదవుతున్నాయని, వీటిని సవాళ్ళుగా తీసుకొని, పోలీసుల పని తీరు మెరుగుపర్చుకోవాలని తెలిపారు. ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజల్లో చైతన్యం నింపేందుకు సోషల్ మీడియాను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా స్కూల్స్,కాలేజీలలో మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్,రోడ్ సేఫ్టీ మీద అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాన్నారు. ఎస్‌పి మాధవ్ రెడ్డి, మాట్లాడుతూ జిల్లాలోని 2022 -2024 వరకు రిపోర్ట్ అయిన కేసులు, మహిళలపై నేరాల కేసులు నమోదు గురించి వివరించారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరును, శాంతిభద్రతల అంశాలను, వాటి పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న చర్యలను డిఐజికి వివరించారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణ, అమ్మకాలు, వినియోగించే వారిపై జిల్లా పోలీసులు చేపడుతున్న చర్యలను తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పార్వతీపురం సబ్ డివిజన్ ఆఫీసు, ఆఫీసర్స్ బెరక్స్, పోలీస్ వ్యాయామశాలను సందర్శించారు. సమావేశంలో పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యాశాఖమంత్రి లోకేష్‌ను కలిసిన వీరేష్ చంద్ర దేవ్

ప్రజాశక్తి - కురుపాం

విశాఖ పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్రదేవ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కూడా కలిశారు. ఈ సందర్భంగా వీరేష్ చంద్రదేవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గల దీర్ఘకాలిక సమస్యలు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లనని, ఆయను సానుకూలంగా స్పందించి సమస్యలు త్వరలోనే పరిష్కరిద్దామని హామీ ఇచ్చారని తెలిపారు.



విద్యాశాఖామంత్రి లోకేష్‌కు బొకేను అందజేస్తున్న వీరేష్

అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి


ప్రధానమంత్రి జన్ మాన్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు మంజూరు చేస్తామని ఎంపిడిఒ జి.పైడితల్లి తెలిపారు. చిన గుడబ పంచాయతీ పరిధిలోని గదబవలసలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జన్‌మాన్ కార్యక్రమంపై ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించామని, వివిధ పథకాలకు ఎవరు అర్హులో పంచాయతీ కార్యదర్శులు సర్వేలు చేశారని తెలిపారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ గోపి గౌరీశంకర రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పువ్వల శిరీష పాల్గొ న్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట/సీతానగరం

మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి ఘనంగా నిర్వహించారు. సీతంపేటలో జరిగిన కార్యక్రమలో కలెక్టర్‌తో పాటు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొనగా, సీతానగరం మండలం గుచిమి రక్షిత అటవీ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎస్‌పి ఎస్ వి మాధవరెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి జిఎపి ప్రసూన స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వనమహోత్సవం ప్రతిజ్ఞ చేశారు.

సీతంపేటలో మొక్కలు నాటిన అనంతరం కలెక్టరు మాట్లాడుతూ వాతావరణ సమతుల్యానికి మొక్కలను విరివిగా పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో జరిగే వేడుకలకు గుర్తుగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. మనిషి మనుగడ ప్రకృతిపై ఆధారపడి ఉంటుందని, ప్రకృతి బాగుండాలంటే చెట్లు ఎక్కువగా ఉండాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించుకోవడంతో పాటు, చెట్లను పరిరక్షించుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, పేపరు కోసం విరివిగా చెట్లను వాడుతున్నారని, కావున పేపరు రీసైకిల్, తిరిగి వినియోగం విధానాన్ని అమలుచేయడం ద్వారా చెట్లనరికివేతను అరికట్టవచ్చని తెలిపారు. భవన నిర్మాణపనులు చేపట్టేటప్పుడు నిర్మాణ ప్రాంగణంలో సాధ్యమైనంత వరకు చెట్లను పరిరక్షించేలా నిర్మాణపనులు చేపట్టాలన్నారు. కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం సాధించుటకు అడవులు, చెట్లు అవసరమని తెలిపారు. చెట్లను ఎక్కువగా పెంచడం ద్వారా, అడవులను పరిరక్షించుకోవడం ద్వారా సకాలంలో వర్షాలు పడతాయని, రుతువులు సక్రమంగా వస్తాయని, తద్వారా వ్యవసాయ దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. మొక్కలు పెంచడంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, కార్యక్రమంలో యువతను భాగస్వామ్యం కల్పించాలన్నారు. డిఎఫ్ఒ ప్రసూన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా గుచిమి రక్షిత అటవీ ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో హెక్టారులో వేయిమొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. అంతేకాకుండా అటవీ శాఖ ద్వారా నర్సరీల్లో మొక్కలు పెంచి పెద్దఎత్తున నాటుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డివిజినల్ ఫారెస్ట్ అధికారులు, రేంజ్ అధికారులు, సెక్షను అధికారులు, సీతానగరం ఎంపిపి బి.రవణమ్మ, జెడ్పిటిసి మామిడి బాబ్జీ, గుచ్చిమి ఎంపిటిసి సిహెచ్. జగదీష్, జోగింపేట సర్పంచ్ కె.సింహాచలం, అటవీశాఖ సిబ్బంది, పార్వతీపురం రిషి పబ్లిక్ స్కూలు, జోగింపేట గురుకులం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీతానగరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యేలు, అధికారులు

జిల్లాలో ఘనంగా వనమహోత్సవం



సీతంపేటలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పాచిపెంట : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కర్రివలస చెరువు వద్ద, స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎపిఒ సత్యనారాయణ, గోపాలకృష్ణ, హెచ్ డబ్ల్యుఒ స్వర్ణలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొండ : పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధా కుమారి అన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడగలమని అన్నారు. కార్యక్రమంలో కమీషనర్ సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు వెలమల మన్మథ రావు, దుప్పాడ పాపి నాయుడు, తుమ్మగుంట శంకర్, గంటా సంతోష్ కుమార్, కడగల రమణ, తదితరులు ఉన్నారు.

బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని కోరి రెవెన్యూ పరిధిలో గల బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చినా అనుమతులు వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మూడడ్ల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం వెలగవలసలో పరిసర గ్రామ గిరిజనులు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, కమిటీ సభ్యులు రవీంద్ర తదితరులతో గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఎంఎస్‌పి గ్రానైట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కృష్ణమూర్తి మాట్లాడుతూ బడిదేవరకొండను దళారుల కోసం ప్రభుత్వం గ్రానైట్ అనుమతులు ఇచ్చిందని ఈ ప్రాంతంలో ఎనిమిది పంచాయతీల రైతులు గిరిజనులకు పూజించే దైవంగా దేవతగా కొలుస్తున్నారని అటువంటి తల్లిని గ్రానైట్ అనుమతులు ఇచ్చి తమ నమ్మకాన్ని వాము చేయడమేనని అన్నారు. బడి దేవరకొండలో ఈ ప్రాంతాల ప్రజలు పూజిస్తేనే మేఘాలు వచ్చి వర్షం పడుతుందని, లేదంటే ఉండదని తమ పూర్వీకుల నుండి పూజించుకుంటూ వస్తున్నారని, అటువంటి తమ దైవాన్ని కొల్లగొట్టడమంటే తమ నమ్మకాలను ద్రోహం చేయడమేనని అన్నారు. ఈ ప్రాంతంలో వర్షం పడడం వల్ల గెడ్డలు, వాగులు ద్వారా పంట పొలాలకు నీరు చేరుకుంటేనే పంట పండుతుందని, లేదంటే ఉండదని అటువంటి దైవాన్ని నాశనం చేస్తున్నారని ఈ ప్రాంత ప్రజలంతా ఆందోళన చెందుతున్నారని అన్నారు. కావున గ్రానైట్ అనుమతులు రద్దు చేసి బడిదేవరకొండను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి రాము తదితరులు పాల్గొన్నారు.



వెలగవలసలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

యుపిఎస్ మాకొద్దు...

తహశీల్దార్ కార్యాలయాల వద్ద యుటిఎఫ్ నిరసనలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఏకీకృత పెన్షన్ స్కీంను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల హక్కు అన్నారు. ఒపిఎస్ కోరుతూ గత 20 ఏళ్లుగాఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటం చేసిన ఫలితంగా కొన్ని రాష్ట్రాలలో పునరుద్ధరణ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కానీ మన రాష్ట్రంలో అమలు కావడంలేదన్నారు. ఇటీవల కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన యుపిఎస్‌కు పాత పెన్షన్‌కు ఎక్కడా పోలికలేదన్నారు. కావున యుపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరు : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన మండల ఉపాధ్యాయులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఆకుల గణపతి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రకటించిన జిపిఎస్, ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుపిఎస్ ఒక తానులో ముక్కల్లాంటివని చెప్పారు. ఈ విధానాలతో ఉపాధ్యాయులకు ఒరిగేదేమీ లేదన్నారు. పాత పెన్షన్ స్కీమ్ కోసమే పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎ.సీతయ్య, కార్యదర్శి కె.జానకీరావు పాల్గొన్నారు.

కురుపాం : యుపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీరాములు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న యుపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం జియ్యమ్మవలస మండలాల యుటిఎఫ్ నాయకులు రవి, కుర్మారావు, గోపాలం తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



రోడ్డుకు అడ్డంగా పడిన కొండ చరియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొండ చరియలు విరిగిపడి రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ప్రధానంగా జరడ గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొండచరియలు రహదారిపై పడడంతో ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పటం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని గిరిజనులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కొండ చరియలు తక్షణం తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎల్విన్‌పేట సిఐగా హరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బి.హరి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన సిఐ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస సర్కిల్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం రూరల్ సిఐగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో ఎక్కడ ఎటువంటి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేస్తానన్నారు. అలాగే ఆంధ్ర - ఒడిస్సా సరిహద్దు నుంచి గంజాయి, నాటుసారా, మద్యం, అక్రమ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని సిఐ తెలిపారు. అనంతరం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సీతంపేట డిడి కార్యాలయాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ సమక్షంలో పనిచేస్తున్నటు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని ఇటీవలే శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆదివాసీ జెఎసి నాయకులు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే జయకృష్ణను కలిసి వినతిని శుక్రవారం అందజేశారు. డిడి కార్యాలయం శ్రీకాకుళానికి తరలిస్తే ఇక్కడి ఏజెన్సీ ఆదివాసీలకు అన్ని విధాలా ఇబ్బందులు ఏర్పడతాయని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆదివాసీ నాయకులు రామ్మోహన్, పురుషోత్తం, విశ్వనాథం, మోహన్ పాల్, చిరంజీవిలు, నరేష్, అప్పారావు, రామస్వామి తదితరులు ఉన్నారు.



బ్యాంకు ప్రారంభిస్తున్న ఆర్ఎం పతాన్

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను పాచిపెంట మండల వాసులు వినియోగించుకోవాలని బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్ పిఎం పతాన్ అన్నారు. శుక్రవారం పాచిపెంటలో కొత్తగా బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఖాతాదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తామన్నారు. అలాగే సేఫ్టీ లాకర్ల సౌకర్యం ఉందని, ఈ బ్యాంకు జాతీయ బ్యాంకు పరిధిలోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ భానుప్రతాప్, సర్పంచ్ పి.సంతోషి, మాజీ ఎంపిపి పిన్నింటి ఈశ్వరరావు, కొత్తల పోలినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

ట్రెజరీ అధికారుల ఉదాశీన వైఖరికి నిరసనగా ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం డిపో ఎదుట ధర్నా చేపట్టారు. నైట్ ఔట్ ఆల్వెంచ్‌లను ప్రభుత్వ జిఓ ప్రకారం యధావిధిగా ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్ని రాయితీలు కూడా సకాలంలో అందించాలని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు బకాయిలు సకాలంలో చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయు జిల్లా ఉపాధ్యక్షులు పిఎల్ రావు, డిపో కార్యదర్శి వి. రాజేష్, ఎంఎస్ రావు, ఎస్‌టి రావు, బిఎల్ నారాయణ, తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి

శతశాతం మార్కులు సాధించాలి : డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

పదో తరగతి ఫలితాల్లో శతశాతం మార్కులు సాధించేందుకు కష్టపడి చదవాలని పాలకొండ డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలం పరిధిలోనే కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. గ్రేడ్ల వారీగా విద్యార్థులను ఎంపిక చేసి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి ఎ,బి గ్రేడ్లకు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ ఏడాది కంటే వచ్చే ఏడాది విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించే ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అనంతరం సెల్ఫ్ అసైన్మెంట్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులుఉన్నారు.

హై స్కూలుకు వాటర్ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి - మక్కువ



వాటర్‌ప్లాంట్‌ను అందజేస్తున్న శ్రీనివాసరావు

మండలంలోని వెంకట బైరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ అందజేసినట్టు ఫౌండర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు సుమారు రూ.25 వేలు విలువ చేసే ఈ ప్లాంట్ ను శుక్రవారం హై స్కూల్‌లో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఏ విధమైన తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎమ్మెస్సార్ ఫౌండేషన్ తోడ్పాటునదించిందన్నారు. వాటర్ర్ ప్లాంట్ అందజేసిన ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావుకు ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో రక్త హీనత నివారణకు అన్ని చర్యలు తీసుకొని రక్తహీనత రహితంగా తీర్చిదిద్దామని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం సీతంపేట ఏజెన్సీలో ఆయన సుడిగాలిలా పర్యటించారు. ముందుగా టిటిడి దేవాలయాన్ని సందర్శించి అక్కడ మొక్కను నాటారు. అనంతరం సీతంపేట వైటిసిలో గర్భిణీ వసతి గృహాన్ని కలెక్టర్‌తో పాటు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారులు సమస్య ఉన్న గ్రామాల గర్భిణీలకు ఈ హాస్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వైద్యుల పర్యవేక్షణలో గర్భిణీల ఆరోగ్యంగా ఉంటారన్నారు. సీతంపేట పరిధిలో 16 పడకలతో గర్భిణుల వసతిగృహం ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. సీతంపేటకు అంబులెన్స్ కేటాయించాలని గిరిజనులు కోరగా జిల్లాకు సిఎస్ఆర్ కింద మూడు అంబులెన్సులు మంజూరు కాగా, ఒక అంబులెన్స్‌ను సీతంపేటకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులకు అవసరమైన ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో మన బాధ్యతగా వ్యక్తిగత, ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సామాజిక బాధ్యతగా స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొని వారికి పౌష్టికాహారం కిట్లను కలెక్టర్, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం పనసగూడలో పిఎం జన్మన్ గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో పనసగూడన

మోడల్ విలేజ్‌గా పనసగూడ : కలెక్టర్



గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మోడల్ విలేజ్‌గా గుర్తించామని చెప్పారు. ప్రతి కుటుంబానికి నీరు, ఇళ్ల కనీస అవసరాలు తీర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పార్వతీపురం, సీతంపేటలో 500 మందికి మెగా డీఎస్సీ కోచింగ్ ఇస్తామని చెప్పారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తామన్నారు. జీడి అధిక దిగుబడికి జీడి పునరుద్ధరణ పథకం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం అడ్వెంచర్ పార్క్‌ను సందర్శించారు. అక్కడ పరిస్థితిని తెలుసుకున్నారు. పిఎంఆర్‌సి వద్ద మ్యూజియంను పరిశీలించారు. పనులు ఎంతవరకు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుమడలో గోకులం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ వివి రమణ, డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిడి అన్నదొర, ఎపిఒ చినబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ గీతాంజలి, తహశీల్దార్ అప్పలరాజు, సిడిపిఒ రంగలక్ష్మి, ఎంపిపి ఆదినారాయణ, సర్పంచులు కళావతి, ఆదిలక్ష్మి, తోటపల్లి ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలోనే పని సర్దుబాటు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఉపాధ్యాయుల పనిసర్దుబాటు ప్రక్రియను సవరించి మండల స్థాయిలోనే అన్ని కేడర్ల పని సర్దుబాటు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిఇఒ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ అధికారులు పై స్థాయి నుండి కింది స్థాయి వరకు గందరగోళానికి గురిచేశారన్నారు. ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు తక్కువ మంది విద్యార్థులు వున్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను పని సర్దుబాటు మండల స్థాయిలో చేయాల్సిన సింపుల్ ప్రక్రియను ఆన్లైన్ పేరుతో కఠినతరం చేశారన్నారు. గత ప్రభుత్వం జిఒ 117 ద్వారా ప్రాథమిక పాఠశాలలన్నీ విచ్ఛిన్నం చేస్తే ఇప్పుడు పని సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీన పరుస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఒక గ్రీవెన్స్‌నూ పరిష్కరించలేదని విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాలతో అంగీకరించిన నిబంధనలను తుంగలో తొక్కారని, మా స్థాయిలో లేదంటే మా స్థాయిలో లేదని, అంతా ఒటి సెల్ అని అధికారులు చేతులు దులుపుకున్నారని అన్నారు. ఆర్‌జెడి స్థాయి అధికారులను కూడా నమ్మకుండా యంత్రాలను నమ్మి ఉపాధ్యాయులను తీవ్ర మనోవేదనకు గురిచేశారన్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అన్ని స్థాయిల పని సర్దుబాటును సవరించి, మండల స్థాయిలోనే అన్ని కేడర్ల పని సర్దుబాటును చేయాలని, అంతవరకు ఎలాంటి పని సర్దుబాటు ఉత్తర్వులు విడుదల చేయొద్దని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను అధికారులు స్పందించకుంటే భవిష్యత్ పోరాటానికి సిద్ధపడతామని తెలిపారు.



లాప్రోస్కోపిన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న సీనియర్ డిఎం శారదా ప్రసాద్

సామాజిక సేవల్లో ఎల్ఐసి ముందంజ

ప్రజాశక్తి - సాలూరు

పాలసీదారులకు ఆర్థిక భరోసా, భద్రత కల్పించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలోనూ ఎల్ఐసి ముందంజలో వుందని సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ దాస్ చెప్పారు. శుక్రవారం స్థానిక ఫిలిడెల్ఫియా లెప్రసీ ఆసుపత్రికి వితరణ ఇచ్చిన రూ.37 లక్షల విలువైన అత్యాధునిక లాప్రోస్కోపిక్ మిషన్, కంటి సంబంధిత పరీక్షల నిమిత్తం బి స్కాన్ మిషన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరులో మొదటిసారిగా ఇలాంటి సామాజిక సేవాకార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పాలసీదారుల భద్రతతో పాటు దేశవ్యాప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు సంస్థ చేయూతనిస్తున్నట్లు చెప్పారు. సాలూరు ప్రాంత ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయంతో అత్యాధునిక వైద్య పరీక్షల నిమిత్తం పరికరాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసి సీనియర్ డివిజనల్ సేల్స్ మేనేజర్ రవి కిరణ్, పార్వతీపురం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, సాలూరు బ్రాంచ్ మేనేజర్ భాస్కరరావు, డెవలప్మెంట్ ఆఫీసర్లు మనోజ్ కుమార్, వెంకటేశ్వరరావు, రాజన్, సీనియర్ ఏజెంట్లు లు కె.తవిటి నాయుడు, పైడిపునాయుడు, ఆసుపత్రి సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధన లక్ష్యంగా పోరాడుతానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. మండలంలోని నర్సిపురం, పెదబొండపల్లి, బందలుప్పి, డోకిశీల, తాళ్లబురిడి, ఎంఆర్ నగరం తదితర పాఠశాలలు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025లో జరగబోయే ఉపాధ్యాయ శాసన మండలికి జరగబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్సీగా ఎన్నుకొంటే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులను సీనియారిటీ ప్రకారం జూనియర్ లెక్చరర్లుగా, డిప్యూటీ ఇఒలుగా, డైట్ లెక్చరర్లు గా ఉద్యోగోన్నతులు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. సిపిఎస్ రద్దు కోరుతూ ఆయా సంఘాల నాయకులతో కలిసి పనిచేస్తానని, జిఒ 117 తప్పకుండా రద్దు చేయిస్తామని, శిశు సంరక్షణ సెలవులను సర్వీస్‌లో ఎప్పుడైనా వాడుకొనేలా చర్యలు తీసుకొంటామని, ఇహెచ్ఎస్ ద్వారా నేరుగా వైద్య సదుపాయం కార్పొరేట్ ఉద్యోగుల మాదిరిగా అందేలా కృషి చేస్తానని శ్రీనివాసులు నాయుడు హామీ ఇచ్చారు. అలాగే ఉపాధ్యాయుల తల్లిదండ్రులు మరణిస్తే కార్యక్రమం నిర్వహణకుకనీసం 15 రోజులు ప్రత్యేక సెలవులు మంజూరు చేయిస్తానని, ప్రతి ఉన్నత పాఠశాలలో రెండు మీడియంలు ఉండేలా, ప్రాథమిక విద్య బలోపేతానికి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకొనేటట్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని, సిబిఎస్‌సి పాఠశాలలపై పున: సమీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట శశికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. శివప్రసాద రావు, రాష్ట్ర కార్యదర్శి జక్కు రామి నాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భోగి రవికుమార్, జిల్లా కార్యదర్శి గుల్ల రామినాయుడు, పెంట గోపాలకృష్ణ, మండల అధ్యక్షులు బొత్స నారాయణ స్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మము నాయుడు, తాతబాబు, రాంబాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

1న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఎ.మోహన రావు తెలిపారు. అలాగే శనివారం వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటనున్నట్టు తెలిపారు.

అక్టోబరు 6, 7న ఎపిటిఎఫ్ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి సీతానగరం

ఎపిటిఎఫ్ విద్యా, వైజ్ఞానిక మహాసభలు అక్టోబర్ 5, 6, 7 తేదీల్లో జరగనున్నట్లు మండల అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యనారాయణ, ఎస్.అచ్చంనాయుడు తెలిపారు. స్థానిక ఎమ్మెల్సీ భవన ఆవరణలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్ర నాయకత్వం వస్తుందని వివిధ అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమంలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎం.శివం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్ పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగింది. కమిషనర్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ పాలకొండ డంపింగ్ యార్డుకు సంబంధించి ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ చొరవతో మల్లమ్మగూడ దగ్గర రెండు ఎకరాల స్థలం గుర్తించామన్నారు. అక్కడ తడి, పొడి చెత్త వేరు చేసి వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. దీనికి కౌన్సిల్ సభ్యులందరూ సహకరించాలని కోరారు. అదే విధంగా వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పెద్దలంతా కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, కౌన్సిల్ సభ్యులు వెలమల మన్మధ రావు, దుప్పాడ పాపి నాయుడు, భాసూరు కాంతారావు, కిల్లారి మోహన్, గంటా సంతోష్, తదితరులు ఉన్నారు

పకడ్బందీగా సార్వత్రిక టీకా కార్యక్రమం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సార్వత్రిక టీకా కార్యక్రమం ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ ఎం.నారాయణరావు స్పష్టం చేశారు. ఈ మేరకు వైద్యాధికారులకు, సిహెచ్‌సి, ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులకు గిరిమిత్ర సమావేశ మందిరంలో రీఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణను డబ్ల్యుహెచ్ఒ సర్వలెన్స్ వైద్యాధికారి డాక్టర్ జాన్ జూడ్ జాషువా పవర్ ప్రజెంటేషన్ ద్వారా అందజేశారు. ఇమ్యునైజేషన్ షెడ్యూల్‌లో చిన్న పిల్లలకు, గర్భిణీలకు నిర్దేశించిన సమయంలో టీకాలు వేయాలని, తద్వారా క్షయ, పోలియో మైలిటీస్, మీజిల్స్, రూబెల్లా, డిఫ్తీరియా, కోరింతదగ్గు, ధనుర్వాతం మొదలగు పది రకాల వ్యాధులకు గురికాకుండా నిరోధించ వచ్చు అని అన్నారు. టీకా పూర్తైన తర్వాత ఆరోజు ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలన్నారు. దద్దుర్లుతో కూడిన జ్వరం, ఎఎఫ్ పి లక్షణాలు గుర్తిస్తే వెంటనే తెలియజేసి వారి నుంచి నమూనాలు సేకరించాలన్నారు. అనంతరం పలు ఆరోగ్య కార్యక్రమాలపై ప్రోగ్రాం అధికారులు సమీక్ష చేశారు. డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ టి. జగన్మోహన్ రావు మాట్లాడుతూ రక్తహీనత, సీజనల్ వ్యాధులు ఎక్కువగా గుర్తించిన గ్రామాల్లో



శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న శిక్షకులు జాషువా

సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు, ఆరోగ్య వద్ధి చెందే అంశాలపై విశ్లేషించి అమలు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీఎస్ కె ప్రోగ్రాం అధికారి డా. రఘుకుమార్, నోడల్ అధికారి డా. వినోద్, పిపియూనిట్ సీనియర్ వైద్యాధికారి డా.విజయమోహన్, ఎస్ఓ శంకర్,విబిడి కన్సల్టెంట్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరగనుందని కమిషనర్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -వీరఘట్టం

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధి ఎస్.గోపాలపురంలో నిర్వహించిన పిఎం జన్‌మాన్ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామంలో రహదారులు, మంచినీటి సౌకర్యం, విద్య, వైద్య, గృహ నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, నైపుణ్య వికాసం, పౌష్టికాహారం అందించడం, జీవనోపాధులు మెరుగుపర్చడం తదితర కార్యక్రమాలు గ్రామంలో నిర్వహిస్తామన్నారు. వీటికి మీ అందరి సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఎవరికి ఏ విధమైన లోటుపాట్లు ఉన్నా సభ దృష్టికి తీసుకురావాలి గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుదర్శనరావు, ఎంపిటిసి పోరెడ్డి వెంకటనాయుడు, మండల ఇంజనీరింగ్ అధికారి డి.కళ్యాణ దుర్గ, ఇఒపిఆర్‌డిఒ ఎం.నాగభూషణరావు, సచివాలయ కార్యదర్శి శ్యాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో ఉద్యోగాలు ఇవ్వక పోతే ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గత ఐదేళ్లుగా ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతులు లావణ్య, బంగారమ్మకు వారం రోజుల్లో తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని, లేకుంటే కలిసి వచ్చే గిరిజన, ప్రజా సంఘాలతో పోరాటం ఉధృతం చేస్తామని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ హెచ్చరించారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట శుక్రవారం జరుగుతున్న"నిరసన దీక్షలు"నాలుగో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనేతరులకు ఉద్యోగాలు ఇవ్వడానికి లేని ఇబ్బందులు, అభ్యంతరాలు గిరిజనులకు ఉద్యోగాలు ఇవ్వడానికి ఏమిటని ప్రశ్నించారు. గిరిజన యువతకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర గవర్నర్, జాతీయ ఎస్టీ కమిషన్, జాతీయ మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే, రాష్ట్ర హైకోర్టు ను ఆశ్రయిస్తామని రంజిత్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగం కోల్పోయిన గిరిజన యువతులు బంగారమ్మ, లావణ్యతో పాటు గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, కోలక మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బంది గోడు ప్రభుత్వానికి పట్టడం లేదని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి అనంతరం విధులకు హాజరయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న శానిటేషన్, పేస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు గత 12 రోజులుగా దశలవారీగా జీతాల కోసం నిరసన చేపడుతున్న తమ గోడు జిల్లా వైద్యాధికారులకు పట్టడం లేదని అన్నారు. ఆరు నెలలుగా వేతనాలు లేకపోయినా ఆకలితో విధులకు హాజరై రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. సమస్యలపై పోరాటాలు, నిరసనలు చేయవద్దని, తమను తొలగిస్తామని వర్కర్లను బెదిరించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు అర్థం చేసుకుని వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు పోలూరు వెంకటరావు, బారికి, సునీల్, ప్రసాదు, ఇందిర, గౌరమ్మ ఉన్నారు.

గృహనిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి తిరుపతియ్య

2016,17, 18,19 సంవత్సరానికి సంబంధించి గృహ నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే ఇళ్ల నిర్మాణం ముందు ప్రగతి, ప్రస్తుత తీరుపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సర్వే చేయించి తదుపరి బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి, మండల నోడల్ అధికారి వేముల తిరుమలయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2016 నుంచి 18 వరకు, 21, 22 సంవత్సరాలకు సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ ప్రగతి, లక్ష్యాలపై పిఎంఎవై, జగనన్న సర్వే చేసిన ఇళ్ల సెక్షన్స్‌కు సంబంధించి లబ్ధిదారుల నుంచి ఆధార్, రేషన్ కార్డ్, బ్యాంకు జిరాక్స్ సేకరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుందన్నారు. మండలంలో మినీ రిజర్వాయర్లు, ఫారం పౌండ్స్ ఉన్నాయా లేదా గుర్తించినట్లయితే రైతులకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, హౌసింగ్ ఎఇ రెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

3న జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ఎస్‌విడి కళాశాల ఆవరణలో సెప్టెంబర్ 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యా అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ చదివి 18 నుండి 30 ఏళ్ళ వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులకు కెఎల్ గ్రూప్ - అమెజాన్ కంపెనీకి అర్హులని ఆయన వివరించారు. వింటా లాబ్స్ కంపెనీ, మంజుశ్రీ టెక్నో ప్యాక్ కంపెనీలకు ఇంటర్మీడియట్, బి ఎస్సీ కెమిస్ట్రీ చదివిన 18 నుండి 27 ఏళ్ల వయస్సు కలిగిన యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను https://skilluniverse.apssdc.in వెబ్ సైట్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్,1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశంలో హాజరు కావాలని ఆయన కోరారు. వివరాలకు 6305110947, 9494777553 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు..

హామీని నెరవేర్చిన సిఎం

ప్రజాశక్తి- వీరఘట్టం

నాయీ బ్రాహ్మణులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెరవేర్చారని టిడిపి అరకు పార్లమెంటు నాయి బ్రాహ్మణుల సాధికార సమితి కన్వీనర్ దల్లవలస శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. దేవాలయాల్లో పనిచేసే నాయి బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలు ప్రకటించారని, దేవాలయాల పాలకమండలిలో నాయి బ్రాహ్మణులకు స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బిసి డిక్లరేషన్, బిసి రక్షణ చట్టం కింద అమలుపర్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కౌరసాలలో 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని, బిసిలకు 50ఏళ్లకు పింఛన్ సౌకర్యం కల్పించేలా నాయి బ్రాహ్మణులు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయి బ్రాహ్మణుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్, మండల అధ్యక్షులు ఎస్.గోపాలం, పి.మజ్జిశ్వరరావు, కె.శ్రీనివాసరావు, నడుకూరు సాయి, తదితరులు పాల్గొన్నారు.